క్లుప్తంగా

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



వీరభద్రపురంలో అక్షతలను పంచిపెడుతున్న త్రినాథమూర్తి తదితరులు

కొత్తవలస: అయోధ్య రామజన్మభూమి నుంచి తీసుకువచ్చిన అక్షతలను సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వీరభద్రపురం, కర్రిచిన్నయ్యపాలెం గ్రామాల్లో శనివారం ఇంటింటికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల త్రినాథమూర్తి తదితరులు పాల్గొన్నారు.

400 మందికి దుస్తుల పంపిణీ



మహిళలకు చీరలు, గాజులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్యవతి తదితరులు

చీపురుపల్లి: మండలంలోని చినననడిపల్లి గ్రామంలో సర్పంచ్ గడే సత్యవతి, గడే మోహనరావు దంపతులు 400 మందికి చీరలు, షర్టులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యవతి మాట్లాడుతూ ఏటా సంక్రాంతికి గ్రామంలో మహిళలకు చీరలు, గాజులు, పురుషులకు షర్టులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన సాలిపిసోమరాజుపేట గ్రామస్తులతో నాయకులు

గుర్ల: మండలంలోని సాలిపిసోమరాజుపేట గ్రామంలో 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికిమండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు శనివారం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గిడిజాల అప్పారావు, బంకపల్లి రాము, వుణుకూరు గురువులు, టొంపల హరి, దాసరి పైడితల్లి, బొడ్డేపల్లి రామారావు, శేఖర్, రమణ, అబద్దం తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

జామి: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని ఆర్.బి. పురం, గొడికొమ్ము గ్రామాల్లో రైతులకు ఏఈఓ బి.గీత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలు, కషాయాలు, ద్రవ, ఘనజీవామృతాల తయారీ, తదితర అంశాలను వివరించారు. ఆర్.బి.పురం,గొడికొమ్ము గ్రామాల సర్పంచ్‌లు వర్రి కృష్ణ,పిల్లల భవాని, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది రమాదేవి, పద్మ, పంచాయ తీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



నాగరాజు (ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తగవిడి వీధికి చెందిన సూరు నాగరాజు శనివారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. కొడుకు మృతి చెందాడన్న దుఃఖంలో ఉన్నప్పటికీ తండ్రి నర్సింహమూర్తి ఆ బాధను పక్కన పెట్టి, కొడుకు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవింద రాజును సంప్రదించి నేత్రాలు దానం చేయనున్నట్లు తెలిపారు. గోవిందరాజు విజయనగ రం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకు సమాచారం అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధు లు చీపురుపల్లి వచ్చి మృతుడి నుంచి కార్నియా సేకరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థులు

చీపురుపల్లిరూరల్: దేవరపొదిలాం ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ఎడ్యూటెక్ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఎంపీటీసీ అధికార్ల శ్రీనివాసరావు,మాజీ ఎంపీటీసీ చింతాడ లక్ష్మణ శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు, విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమిలి సభను విజయవంతం చేద్దాం

- ఈనెల 27న భీమిలిలో సీఎం జగన్ బహిరంగ సభ
- ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలి
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గజపతినగరం పార్టీకార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ఎన్నికల శంఖారావం పూరించడంలో భాగంగా ఈనెల 27న విశాఖపట్నం జిల్లా భీమిలిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బహి రంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. కొండ తామరపల్లి జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో గంట్యాడ మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త అంకిత భావంతో సైనికుడిలా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అంతా కలిసి కట్టుగా పనిచేస్తే నియోజక వర్గంలో పార్టీకి మంచి మెజార్టీ తీసుకురావచ్చొని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని, పార్టీలు, కులాలు, మతాల కు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నందున ప్రజలను ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం నేరవేర్చిన ఏకైక పార్టీ మనదేనని అన్నారు. ప్రజాప్రతినిధులు అంతా నిరంతరం ప్రజలతో మమేకం కావాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గ్రామాల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు.టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు, దోపిడీని ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రంధిరామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణమూర్తి, ప్రభూజీ, కొడెల ముత్యాలనాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బహిరంగసభకు తరలిరండి

గజపతినగరం: భీమిలిలో ఈనెల 27న నిర్వహించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో శనివారం సాయంత్రం ఆయన సమావేశ మయ్యారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

31న వైఎస్సార్ ఆసరా సంబరాలు

గజపతినగరం బైపాస్ రోడ్డులో ఉన్న పర్ణశాల వద్ద ఈనెల 31న నిర్వహించే వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేసేందుకు పార్టీ క్రియాశీలక సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ లు, ఎంపీటీసీలు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య విజ్ఞప్తి చేశారు. పథకం లబ్ధిదారులైన డ్వాక్రా సంఘాల సభ్యులు అంతా హాజరు కావాలని కోరారు. సంబరాలకు వచ్చే వారికి భోజనాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఫిబ్రవరిలో వైఎస్సార్ చేయూత సంబరాలను మండలాల వారీగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ కె.ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, రేగ సురేష్, లెంక శ్రీనివాసరావు, జి.కామునాయుడు, జి.ఈశ్వర రావు, కె.పైడిపునాయుడు,సామంతుల పైడిరాజు, జి.పైడిపునాయుడు,బైరెడ్డి శ్రీను, డి.దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీవి చవకబారు రాజకీయాలు

- అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించడాన్ని టీడీపీ తట్టుకోలేకపోతోంది
- అంబేడ్కర్ ఆశయాలకు వారసుడు సీఎం జగన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు



విలేకరుల సమావేశంలో నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

చీపురుపల్లి: తెలుగుదేశం పార్టీ నాయకులు చవకబారు రాజకీయాలు చేయడం మానుకోవాలని, ఇంకా వారి జిమ్మిక్కులను ప్రజలు నమ్మేస్థితిలో లేరని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోరుకొండ దాలయ్య, నాయకులు రేగిడి రామకృష్ణ, బవిరి రవిశంకర్, పోలయ్య, రాము, చంటి అన్నారు. పట్టణం లోని జెడ్పీటీసీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాబాసాహేబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు నిరసన చేపట్టడం విడ్డూరం గా ఉందన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయవాడలో 206 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తే, కడుపు మంటతో టీడీపీ నాయకులు నిరసనలు తెలుపుతూ వింతగా వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు వారసుడిగా సీఎం జగన్ నిలిచారన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 18.81 ఎకరాల్లో రూ. 404 కోట్లు ఖర్చు చేసి అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం, ఏర్పాటు చేయడం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు ఇంకా గుర్తున్నాయని అన్నారు. సీఎం జగన్ అమరావతిలో 50 వేల మంది దళిత, బడుగు, బలహీన వర్గాల వారి కి ఇళ్ల పట్టాలు పంచి పెట్టార న్నారు. అది చూసి తట్టుకోలేక చంద్రబాబునాయుడు కోర్టుకు వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నిం చారని అన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల కోసం మాట్లాడే అర్హత టీడీపీ నేత లకు లేదన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చీపురుపల్లిరూరల్: దేవరపొదిలాం గ్రామంలోని శివాలయం వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎంపీటీసీ అధికా ర్ల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ చింతాడ లక్ష్మణ,నాయకులు పెద్ది గోవింద, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దత్తిరాజేరు: దత్తి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ ప్రభాకర్



బొండపల్లి: గొట్లాంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి, దత్తి, పోరలి, గడసాం,దత్తిరాజేరు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గజపతినగరం సీఐ ఎస్.వి.ప్రభాకర్ శనివారం పరిశీలించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలిస్తున్నామని సీఐ చెప్పారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో తగాదాలు జరగకుండా బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, సమస్యాత్మక గ్రామాలపై పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ శిరీష ఉన్నారు.

గొట్లాంలో..

బొండపల్లి: మండలంలోని గొట్లాం ఉన్నత పాఠశాలలోనిపోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను, ఇంకా ఏర్పాటు చేయాల్సిన వసతులపై నివేదికను తయారు చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్ ఉన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌లో చీపురుపల్లి విద్యార్థులు



హర్యానాలో జరిగిన ఐఐఎస్ఎఫ్‌లో పాల్గొన్న బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, గైడ్ కృష్ణారావు

చీపురుపల్లి: జాతీయ స్థాయిలో ఈ నెల 17 నుంచి 20 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల ట్రాన్స్ లేషన్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)లో చీపురుపలి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్, కేంద్ర అంతరిక్ష పరిశోధనా సంస్థ నేతృత్వంలో సైన్స్‌ఫెస్టివల్ సాగింది. ఏపీ నుంచి 20 మంది విద్యార్థులను సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక చేయగా అందులో చీపురుపల్లికి చెందిన జేఎస్ఎస్. శ్రీవిద్య, ఎం.ఆర్.గాయత్రీదేవి, ఎస్.సుప్రియ, డి.పార్థసారథి, టీవీఎం.సూరజ్‌లు ఉన్నారు. వీరివెంట గైడ్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మిరియాల కృష్ణారావు వెళ్లారు. ఫోల్డ్ స్కోప్, ఫెర్న్‌రైజోం వంటి ప్రదర్శనలు తిలకించారు. ఇస్రో, విజ్ఞాన భారతి వంటి జాతీయ సంస్థలు ఏర్పాటు చేసిన మెగా ఎక్స్‌పోను విద్యార్థులు తిలకించినట్టు విద్యార్థులు తెలిపారు.

గృహనిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: జగనన్న లేఅవుట్‌తో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. హౌసింగ్‌డేలో భాగంగా వల్లంపూడి సచివాలయంలో లబ్ధిదారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యానికి గల కారణాలపై ఆరా తీశారు. బిల్లులు సకాలంలో అందిస్తున్నామని, ఇంకా డబ్బులు అవసరమైన వారు వెలుగు ద్వారా రూ. 35 వేల రుణం పొందవచ్చని చెప్పారు. నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా గృహనిర్మాణశాఖాధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవచూపాలన్నారు.ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమ, వెలుగు ఏపీఎం శ్రీను, ఏఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిందు,తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు



స్ప్రింకర్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

వేపాడ: బిందు,తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో ని ముకుందపురంలో ఓ రైతు పొలంలో రాయితీపై ఏర్పాటుచేసిన స్ప్రింకర్ల యూనిట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా బిందు,తుంపర సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు ఆయన వివరించారు. బిందు, తుంపర సేద్యం విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, డ్రిప్‌లు ద్వారానే పంటకు ఎరువులు కూడా అందించవచ్చని చెప్పారు. చిన్న,సన్నకారు రైతులకు రూ.2,18,000 విలువైన పరికరాలను 90 శాతం రాయితీతో అయిదు ఎకరాలకు మించకుండా అందిస్తామని చెప్పారు. పరికరాలు అవసరమైన రైతులు తమ రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

దత్తిరాజేరు: మండల కేంద్రంలో జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు నివాసం వద్ద ఆదివారం ఉదయం మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి శనివారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరు కానున్నారని తెలిపారు. భీమిలిలో ఈనెల 27న నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభతో పాటు త్వరలో మండలంలో నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా, చేయూత సంబరాలపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ముగిసిన 'ఆడుదాం-ఆంధ్రా' మండలస్థాయి పోటీలు

శృంగవరపుకోట: 'ఆడుదాం-ఆంధ్రా' మండల స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరు సుధారాజు పాల్గొని మండల స్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతు లు ప్రధానం చేశారు. నియోజకవర్గస్థాయి పోటీలు ఈనెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల క్రీడా కో-ఆర్డినేటర్ పి.శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో కర్రిచిన్నయ్యపాలెం జట్టు విజయం

కొత్తవలస: మండలంలో గత పదిరోజులుగా సాగుతున్న మండలస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. క్రికెట్ పోటీల్లో 21 జట్లు మండలస్థాయి పోటీల్లో తలపడగా కర్రిచిన్నయ్య పాలెం జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ కృష్ణంరాజు తెలిపారు. కర్రిచిన్నయ్యపాలెం జట్టును పలువురు అభినందించారు.



వేపాడ: టాస్ వేసి క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, జెడ్పీటీసీ అప్పారావు



శృంగవరపుకోట: మండలస్థాయి విజేతలకు బహుమతుల అందజేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

వేపాడ: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అన్నారు. వేపాడలో శనివారం నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఆయన ప్రారంభించారు. ఫైనల్‌లో కొండగంగుబూడి జట్టుపై వావిలపాడు జట్టు విజయం సాధించింది. విజేత జట్టును మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు అభినందించారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగ్గుబాబు పాల్గొన్నారు.



కొత్తవలస:నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన కర్రిచిన్నయ్యపాలెం జట్టు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

గజపతినగరం: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి గజపతినగరంలోని మూడు కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సెంట్రల్ లెవెల్ అబ్జర్వర్లు కె.శ్రీనివాసరెడ్డి, పొట్నూ రామారావు,నాగమణి తెలిపారు. బాలుర హైస్కూల్లో 192 మందికి 174 మంది, బాలికోన్నత పాఠశాలలో 192 మందికి 171మంది, హర్షవర్ధన హైస్కూల్లో 183 మందికి 155 మంది హాజరయ్యారని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్స్ ఎం.వెంకటేశ్వరరావు, చిప్పాడ రమేష్ కుమార్, త్రినాథ రావు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

బొండపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నా రు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడోరోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సరైన ప్రణాళికలు అవసర మన్నారు. పంచాయతీల ఆదాయ వనరుల ఆధారంగా గ్రామాల్లో తక్షణం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపిక చేసుకుని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

సంక్షిప్తంగా...

సెక్షన్ 106ను రద్దు చేయాలి

గుర్ల: వాహన డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ కింద తీసుకువచ్చిన సెక్షన్ 106ను రద్దు చేయాలని గుర్ల మండల లారీ డ్రైవర్లు డిమాండ్ చేశారు. గుర్లలో ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. మండల లారీ డ్రైవర్ల అసోసియన్ అధ్యక్షుడు బోడిశింగి త్రినాథ్ మాట్లాడుతూ సెక్షన్ 106 వల్ల తప్పు చేయని డ్రైవర్లకు కూడా జైలు శిక్ష పడే అవకాశం ఉందని అన్నారు. ఇలాంటి నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.డ్రైవర్లు సోమేష్, సత్యం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: నాగళ్లవలస సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. సబ్‌స్టేషన్‌లో మర మ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో జమ్ము, జమ్ముపేట, నాగళ్లవలస, సదానందపురం, గొలగాం, తాటిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

జామి: సోమయాజులపాలెం,వి.ఆర్.పాలెం గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకట అప్పారావు, చుక్క లక్ష్మి, ఎంపీటీసీ ఆర్.సత్యం తెలిపారు. మండలపరిషత్ నిధులతో ఆయా గ్రామాల్లో తాగునీటి బోర్ల ఏర్పాటుకు శనివారం డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. నిధులు మంజూరు చేసిన ఎంపీపీ అరుణ,జెడ్పీటీసీ గొర్లె సరయుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

26 మద్యం సీసాలు స్వాధీనం

గుర్ల: గూడేం జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. నింది తుడి నుంచి 26 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని చెప్పారు.

23 నుంచి ఫార్మెటివ్-3 పరీక్షకు సిద్ధం

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 23వ తేదీ నుంచి ఫార్మెటివ్-3 పరీక్ష నిర్వహించనున్నట్ల ఎంఈఓ విమలమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీకి వచ్చిన పరీక్ష పత్రాలను, ఓఎంఆర్ సీట్లను తరగతుల వారీగా పాఠశాలలకు చేరవేసేందుకు సిబ్బందితో శనివారం సిద్ధం చేయించారు.

ఆసరా సంబరాలకు ఆహ్వానం

బొండపల్లి: మండల కేంద్రంలో వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాలకు గ్రామాల్లో లబ్ధిదారులను వీఓఏలు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు.బి.రాజేరులో వీఓఏలు శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానం పలికారు. డ్వాక్రా సభ్యులకు మూడు విడతల్లో ఎంత మొత్తం రుణమాఫీ కింద జమయ్యిందో, నాలుగోవిడత ఎంత మొత్తం అందనుందో వివరించారు.ఎంపీపీ చలంనాయుడు,వెలుగు ఏపీఎం సులోచనాదేవిపాల్గొన్నారు.